క్లుప్తంగా

చుండూరు మృతవీరులకు నివాళి



నెహ్రూనగర్: చుండూరు మృత వీరుల పోరాట స్ఫూర్తితో పోరాటాలకు యావత్ దళిత జాతి ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటుందని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బండ్లమూడి స్టాలిన్ పేర్కొన్నారు. చుండూరు మృత వీరులను స్మరించుకుంటూ గుంటూరు లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఘన నివాళులర్పించారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి, చుండూరు మృతువీరుల చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులలో ఐక్యత లేకపోవడం వలనే దళితులపై దాడులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు డేవిడ్ విలియమ్స్, బహుజన చిరు వ్యాపారుల సంఘం అధ్యక్షులు తన్నీరు సాంబయ్య పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌కు తెనాలి ఎమ్మెల్యే పరామర్శ



నగరంపాలెం: గాయపడిన కానిస్టేబుల్ రమేష్‌బాబుకి మెరుగైన చికిత్స అందించాలని తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ కోరారు. తెనాలి వైకుంఠపురం దేవస్థానం ప్రాంగణంలో శనివారం దుండగులను పట్టుకునే ప్రయత్నంలో గాయపడి ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కానిస్టేబుల్‌ను ఆదివారం పరామర్శించారు. కానిస్టేబుల్ తండ్రి బసవయ్యకు ఆర్థిక సహాయం అందించారు. ఎమ్మెల్యే వెంట తెనాలి పట్టణ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎం.హరిప్రసాద్, తెనాలి ఒకటో టౌన్ సీఐ కె.చంద్రశేఖర్ ఉన్నారు.

నేడు నగరపాలక సంస్థలో స్పందన

నెహ్రూనగర్: స్థానిక సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి రోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు సచివాలయాల్లోనూ స్పందన ఉంటుందని, స్థానికంగా పరిష్కారం కాని సమస్యలపై నేరుగా తమకు ఫిర్యాదు చేయవచ్చని ఆమె సూచించారు.

కత్తిసాము గొప్ప ప్రాచీన కళ



గుంటూరు వెస్ట్(క్రీడలు): జిల్లా స్థాయి ఫెన్సింగ్ అండర్–19 పోటీలను వైఎస్సార్ సీపీ నాయకురాలు నూరి ఫాతిమా ఆదివారం ప్రారంభించారు. జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక బీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ కత్తిసాము గొప్ప ప్రాచీన కళన్నారు. ఈ కళలో మనదేశానికి అద్భుతమైన చరిత్ర ఉందని చెప్పారు. చిన్నారులు క్రమం తప్పకుండా క్రీడా సాధన చేయాలని చెప్పారు. జిల్లా కార్యదర్శి డి.అశోక్ బాబు మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి 40 పోటీల్లో పాల్గొన్నారన్నారు. ప్రతిభకనబరచిన వారిని గుర్తించి త్వరలో జరగనున్న రాష్ట్ర పోటీలకు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు షేక్ మీరావలి, సంకురు శ్రీనివాసరావు, ఫెన్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

మిర్చి యార్డు మహిళా డైరెక్టర్‌కు సత్కారం



నగరంపాలెం: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, తద్వారా తమదైన ముద్రవేస్తున్నారని గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ(మిర్చి యార్డు) డైరెక్టర్ గుడివాడ అరుణరవీందర్ అన్నారు. ఇటీవల మిర్చియార్డు డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అరుణరవీందర్‌ను స్నేహితుల దినోత్సవం సందర్భంగా గుంటూరు ఆర్యవైశ్య మహిళ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అరండల్‌పేటలోని ఓ హోటల్‌లో ఘనంగా సత్కరించారు. ఆర్యవైశ్య మహిళా నాయకురాలు డోగిపర్తి సుజాత, డి.సుధ, సీహెచ్.మాధవి, ఓ.ధర్మిళ, ఎం.సునీత, పి.సీత పాల్గొన్నారు.

కార్పొరేషన్ స్థలంలో ప్రహరీ ధ్వంసంపై కేసు

గుంటూరు ఈస్ట్: కార్పొరేషన్ స్థలంలో ప్రహరీని ఓ నిర్మాణ సంస్థ నిర్వాహకులు పగుల గొట్టిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. కృష్ణనగర్‌లోని కార్పొరేషన్‌కు చెందిన స్థలం పక్కనే నిర్మాణ పనులు చేపట్టిన జోషిక ఇన్‌ఫ్రా డెవలపర్స్ నిర్వాహకులు ఆదివారం గోడను పగుల గొట్టారు. సిటీప్లానర్ ప్రదీప్‌కుమార్ ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పక్కాగా ఓటరు జాబితా

- ఈ నెల 21వ తేదీ వరకు సమగ్ర ఓటరు సర్వే
- మార్పులు, చేర్పులకు అవకాశం
- ఒకే డోర్ నంబర్‌పై పదుల సంఖ్యలో ఉన్న ఓట్లు పరిశీలన



సమగ్ర ఓటరు సర్వే చేస్తున్న బీఎల్‌ఓలు

నెహ్రూనగర్: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం. ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల భవితవ్యాన్ని నిర్ణయించే అవకాశం ఓటరుకే ఉంది. ఉత్తమ విలువలున్న వ్యక్తిని ప్రజాప్రతినిధిగా ఎన్నుకున్నప్పుడే వారి ద్వారా అభివృద్ధి సాధ్యం. ఇలా చేయాలంటే అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ విధిగా ఓటరుగా ఉండాలి. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం 18 ఏళ్లు నిండిన వారంతా ఓటరుగా నమోదు చేసుకోవాలి. అయితే చాలా మంది యువకులు ఓటరుగా నమోదు కావడానికి ఆసక్తి చూపడం లేదు. ఈ పరిస్థితుల్లో ఎన్నికల సంఘం మరోసారి ఓటరుగా నమోదు చేసుకోవడానికి అవకాశం కల్పించింది. దానితో పాటు మార్పులు, చేర్పులు, తొలగింపులకు షెడ్యూల్ ప్రకటించింది.

ఇంటింటి సర్వే..

గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో ఈ నెల 21వ తేదీ వరకు బీఎల్‌ఓలు ఇంటింటికి వెళ్లి సర్వే చేయనున్నారు. తూర్పులో 250 మంది బీఎల్‌ఓ(బూత్ లెవల్ ఆఫీసర్), పశ్చిమలో 282 బీఎల్‌ఓలు విధులు నిర్వహిస్తున్నారు. వీరిపై సూపర్‌వైజర్వీ అధికారులుగా తూర్పులో 19, పశ్చిమలో 23 మందిని నియమించారు. ఇప్పటికే పూర్తి స్థాయిలో ఇంటింటికి వెళ్లి సర్వే చేస్తున్న బీఎల్‌ఓలు ఓటర్ల జాబితా క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

ఒకే డోర్ నంబర్‌పై వివాదాలు..

ఒకే డోర్ నంబర్‌లో పదుల సంఖ్యలో ఉన్న ఓటర్ల జాబితాను కూలంకుషంగా పరిశీలిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో కమిషనర్ కీర్తి చేకూరి, అదనపు కమిషనర్ పెద్ది రోజా, డెప్యూటీ కమిషనర్లు, సూపర్‌వైజర్ అధికారులు ఇంటింటి ఓటర్ల సర్వే పర్యవేక్షిస్తున్నారు. అద్దెలకు నివాసం ఉంటూ ఇళ్లు మారే వారికి ఫారం 8లో షిఫ్టింగ్‌లో ఓటర్ కార్డు మారుస్తున్నారు. అపార్ట్‌మెంట్స్‌లో నివాసముండే వారికి ఒకే డోర్ నంబర్ ఉంటుంది కాబట్టి, వారికి డోర్ నంబర్ పక్కన ప్లాట్ నంబర్‌తో ఓటర్ కార్డు నమోదు చేస్తున్నారు.

ఓటర్ల జాబితా వివరాలు

తూర్పులో మొత్తం ఓటర్లు	2,36,923
పురుషులు	1,15,130,
మహిళలు	1,21,747
ఇతరులు	46
పశ్చిమలో మొత్తం ఓటర్లు	2,64,584
పురుషులు	1,29,227
మహిళలు	1,35,303
ఇతరులు	54

చేర్పులు, మార్పులకు అవకాశం

సాధారణంగా 18 ఏళ్లు నిండిన వారు ఫారం – 6ను సమర్పించాలి. అలాగే పాత ఓటర్లు తమ ఓటు కార్డులో చేర్పులు, మార్పులు లేదా ఓటరు చనిపోతే అతని ఓటరు కార్డు తొలగింపునకు ఫారం – 7, 8, 8ఏ ఉంటాయి.

ఆన్‌లైన్‌లో చేసుకోవచ్చు

రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన నిబంధనల ప్రకారం కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకోవడానికి ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సీఈఓ.ఆంధ్రా.కమ్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఓటు హక్కు దరఖాస్తు చేసుకోవచ్చు. కొత్తగా ఓటు నమోదు చేసుకోవాల్సిన వారు ఫారం–6తో పాటు ఒక పాస్ ఫొటో జత చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి.

ఇది షెడ్యూల్..

ప్రత్యేక ఓటరు నమోదు సవరణ 2024లో భాగంగా అక్టోబర్ 17న ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటించనున్నారు. ఆ జాబితాపై అక్టోబర్ 17 నుంచి నవంబర్ 30 వరకు అభ్యంతరాలు స్వీకరించనున్నారు. డిసెంబర్ 26వ తేదీ నాటికి అభ్యంతరాల పరిశీలను పూర్తి చేసి 2024 జనవరి 5వ తేదీన తుది ఓటరు జాబితా ప్రకటించనున్నారు. కాగా అక్టోబర్ 28, 29, నవంబర్ 18, 19 తేదీల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆయా రోజుల్లో నగరంలోని పోలింగ్ బూతుల్లో బీఎల్‌ఓలు అందుబాటులో ఉండి ప్రజల నుంచి వినతులను స్వీకరించేందుకు అవకాశం ఇచ్చారు.

బీఎల్‌ఓలకు సహకరించాలి



నగర ప్రజలు బీఎల్‌ఓల ద్వారా జరిగే ఇంటింటి సర్వేను సద్వినియోగం చేసుకోవాలి. తమ ఇంటి వద్దకు ఓటర్ సమాచారం కోసం వచ్చే బీఎల్‌ఓలకు తగిన సమాచారం అందించడం ద్వారా ఎటువంటి పొరపాట్లు లేని ఓటర్ల లిస్ట్ తయారీకి, తమ ఓట్లలో తప్పులు లేకుండా చూసుకోవడానికి అవకాశం ఉంది.

– కీర్తి చేకూరి,
నగరపాలక సంస్థ కమిషనర్, తూర్పు ఈఆర్వో

అమ్మపాలే అమృతం

నేటితో ముగియనున్న తల్లిపాల వారోత్సవాలు



బిడ్డకు పాలు ఇస్తున్న తల్లి చిత్రం

గుంటూరు మెడికల్: పుట్టిన బిడ్డకు తొలి ఆహారం తల్లి పాలు. తొలి టీకా కూడా అమ్మపాలే. నూరు శాతం పోషక విలువలున్న తల్లిపాలు శిశువు ఆరోగ్యంగా ఎదగటంలో కీలక పాత్ర. అమ్మపాలు బిడ్డకు అమృతాహారం. ప్రపంచంలో నేటి వరకు తల్లిపాలకు ప్రత్యామ్నాయం ఏదీ లేదు. ఇదే విషయాన్ని వైద్యులు కూడా ధ్రువీకరిస్తున్నారు. శిశు మరణాల నియంత్రణ కు ప్రపంచ ఆరోగ్య సంస్థ విస్తృత ప్రచారం చేపట్టింది. అందులో భాగంగా ఏటా ప్రపంచ వ్యాప్తంగా ఆగస్టు మొదటి వారాన్ని తల్లిపాల వారోత్సవంగా 1992లో ఐక్యరాజ్యసమితి నిర్దేశించి 210 దేశాల్లో అమలు చేస్తుంది. తల్లిపాల ఆవశ్యకత గురించి వరల్డ్ అలయన్స్ ఫర్ బ్రెస్ట్ ఫీడింగ్ యాక్షన్ అనే సంస్థ ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం చేస్తుంది. ఒకటి నుంచి నిర్వహిస్తున్న తల్లిపాల వారోత్సవాలు సోమవారం ముగియనున్నాయి.

తల్లిపాలతో ప్రయోజనాలు...

- తల్లిపాలలో సహజ సిద్ధమైన ప్రొటీన్లు లాక్టోఫెరిన్, కొలెస్ట్రమ్,కొన్ని కీలకమైన హార్మోన్లు, రోగ నిరోధక బ్యాక్టీరియా ఉంటాయి
- తల్లిపాలు తాగే పిల్లలో తెలివితేటలు ఎక్కువ. డబ్బాపాలు తాగే పిల్లల కంటే చురుగ్గా ఉంటారు
- పాలు ఇవ్వటంతో తల్లీబిడ్డ మధ్య అనుబంధం పెనవేసుకుంటుంది
- మంచి గుణాలు, మానవ సంబంధాలు శిశువులో పుట్టుక నుంచే అలవడతాయి
- పాలిచ్చే తల్లులకు క్యాన్సర్ వచ్చే అవకాశం తక్కువ
- పొత్తి కడుపు త్వరగా తగ్గిపోతుంది. పాలు ఇస్తున్నంత కాలం వెంటనే గర్భం రాకుండా కృత్రిమంగా ఆగిపోతుంది
- ప్రసవ సమయంలో అయ్యే బ్లీడింగ్ కూడా త్వరగా తగ్గిపోతుంది.

అపోహలు వీడాలి



సాధారణం కాన్పు జరిగితే అరగంట వ్యవధిలోనే బిడ్డకు పాలు ఇవ్వొచ్చు. ఆపరేషన్ ద్వారా కాన్పు అయితే నాలుగు గంటల నుంచి ఆరు గంటల వ్యవధిలో పాలు ఇవ్వొచ్చు.శిశువు మెదడు బాగా వృద్ధి చెందేందుకు రెండేళ్ల సమయం పడుతుంది. అప్పటి వరకు తల్లిపాలు పట్టడం మంచిది. పాల ఉత్పత్తులపై సమాచార సాధనాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. బిడ్డకు పాలు ఇవ్వటం వల్ల స్తనాలు పాడవుతాయన్న అపోహ కూడా ఉంది. కృత్రిమ పాల పొడులపై ఆధారపడుతున్న శిశువుల్లో మరణాలు ఎక్కువగా సంభవిస్తున్నాయి. అతిసారం, నెమ్ము, అలర్జీ, అంటువ్యాధులు వ్యాప్తిస్తాయి.

– డాక్టర్ బూసిరెడ్డి దీప్తిరెడ్డి,
స్త్రీ ప్రసూతి సంతాన సాఫల్య వైద్యనిపుణులు

అవగాహన సదస్సులు నిర్వహించాం..



తల్లిపాల వారోత్సవాలలో భాగంగా వారం రోజుల పాటు తల్లిపాల ప్రాధాన్యంపై అవగాహన కల్పించా. జిల్లా వ్యాప్తంగా 26,432 మంది బాలింతలు ఉన్నారు. వీరంతా పుట్టిన బిడ్డలకు రెండేళ్ల వరకు పాలు ఇచ్చేలా అమ్మపాల ప్రాధాన్యత గురించి వైద్య సిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బందితో కలసి సందేశాన్ని తీసుకెళ్లాం.

–డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు,
జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి

దళితులపై దాడులను తిప్పికొట్టాలి



లాడ్జి సెంటర్‌లో మృతవీరులకు నివాళులర్పిస్తున్న భీమ్ సేన సేవాదళ్ సభ్యులు

నెహ్రూనగర్: దళితులపై దాడులను ఐక్యంగా పోరాడి వాటిని తిప్పికొట్టాలని భీమ్ సేన సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపు నీలాంబరం తెలిపారు. చుండూరు మృత వీరుల సంస్మరణ కార్యక్రమంలో ఆదివారం లాడ్జిసెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగింది. ఆయన మాట్లాడుతూ చుండూరులో అగ్రవర్ణాల వారు దారుణంగా 8 మందిని హత్య చేసిన ఘటనలో దోషులను కఠినంగా శిక్షించకపోవడం దారుణమన్నారు. చుండూరు మరణకాండలోని దోషులను ఇప్పటికైన కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు ఎస్‌జే విద్యాసాగర్, నాగేశ్వరరావు, గనిరాజు, జూపూడి శ్రీనివాసరావు, తిప్పాబత్తిన గోవింద్, గోపి పాల్గొన్నారు.

భీమ్ భారత్ ఆధ్వర్యంలో..

దళిత బహుజన ఉద్యమాలకు నాంది కారంచేడు, చుండూరు ఘటనలే అని భీమ్ భారత్ రాష్ట్ర నాయకుడు పాగళ్ల ప్రకాష్ తెలిపారు. ఆదివారం అంబేడ్కర్ భవన్‌లో భీమ్ భారత్ పల్లె పల్లెకు చైతన్య సమావేశాల్లో భాగంగా చుండూరు మృత వీరుల సంస్మరణ సభ నిర్వహించారు. కార్యక్రమంలో రిటైర్డ్ డీఐజీ(రిజిస్ట్రేషన్స్) చావలి బాలస్వామి, విద్యాసాగర్, బాబూరావు, జెల్ది మోహన్, కమల, ప్రసాద్, రమేష్ పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనలకు నిరసనగా ర్యాలీ



పాత గుంటూరు: మణిపూర్‌లో జరుగుతున్న మారణకాండను ఖండిస్తూ ప్రగతిశీల కార్మిక సమాఖ్య గుంటూరు నగర కమిటీ ఆధ్వర్యంలో నగరంలో ఆదివారం నిరసన ర్యాలీ నిర్వహించారు. పి.కె.ఎస్ నగర కమిటీ కార్యదర్శి ఎస్.పోతురాజు మాట్లాడుతూ మణిపూర్ మారణకాండకు బాధ్యత వహిస్తూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీలపై దాడులకు పాల్పడటమే కాకుండా మహిళలను నగ్నంగా ఊరేగించి ఆపై వారిపై లైంగిక దాడి, హత్యలకు పాల్పడటం సిగ్గు చేటన్నారు. నాయకులు గనిరాజు మాట్లాడుతూ లక్షల కోట్ల విలువ చేసే ఖనిజ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకే ఈ దారుణాలు చోటుచేసుకున్నాయని మండిపడ్డారు. ఇప్పటికైనా మణిపూర్ మారణకాండను అరికట్టి ఆదివాసీలకు రక్షణ కల్పించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కులనిర్మూలనా పోరాట సమితి జిల్లా కార్యదర్శి కె.నాగేశ్వరరావు, బి.కొండారెడ్డి, ప్రగతిశీల కార్మిక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి కంబాల ఏడుకొండలు, సభ్యులు శిఖనం సాంబయ్య, బి.కోటేశ్వరరావు(భారత్ బచావో) సిహెచ్.రాజశేఖర్, శాంతమ్మ పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

మేయర్ కావటి మనోహర్‌నాయుడు



12వ డివిజన్‌లో పర్యటిస్తున్న మేయర్ కావటి, అధికారులు

నెహ్రూనగర్: గుంటూరు నగరాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు చెప్పారు. ఆదివారం నగరంలోని 12వ డివిజన్ చందన బ్రదర్స్ నుంచి కోడి గుడ్డు సత్రం వరకు రోడ్డుకు ఇరువైపుల డ్రైయిన్లు నిర్మించుటకు స్థలాన్ని, ఆక్రమణలను స్థానిక పెద్దలు, అధికారులతో కలసి పరిశీలించారు. మేయర్ మాట్లాడుతూ గుంటూరు తూర్పు నియోజకవర్గంలో చిన్నపాటి వర్షానికే రోడ్లు జలమయం అవుతున్నాయని, ఆ బాధలను తొలగించేందుకు రూ.1.30 కోట్ల ఆర్థిక సంఘం నిధులతో డ్రైయిన్లు నిర్మించుటకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఖాజా మొహిద్దీన్ చిష్టి, ఈఈ కోటేశ్వరరావు, ఏసీపీ అజయ్ కుమార్ పాల్గొన్నారు.

చిన్నారులకు తల్లి పాలు ఎంతో శ్రేష్ఠం

నెహ్రూనగర్: చిన్నారులకు తల్లి పాలు ఎంతో శ్రేష్ఠమైనవని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు పేర్కొన్నారు. ప్రపంచ తల్లి పాల వారోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం నగరంలోని 20వ డివిజన్ నల్ల చెరువులోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణి, బాలింతలకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు టెంట్ హౌస్ బాబు, కంతేటి శ్యాం శేఖర్, కవిత, ఫాతిమా, రియాజ్ పాల్గొన్నారు.

గ్రామీణ సంప్రదాయాల్ని ముందుకు తీసుకెళ్దాం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న చీఫ్ కోచ్ వెంకటేశ్వరరావు

గుంటూరు వెస్ట్(క్రీడలు): గ్రామీణ సంప్రదాయం, వాతావరణాన్ని ఎవ్వరూ మరచిపోలేరని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ జి.వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక బీఆర్ స్టేడియంలో పోటీల వాల్‌పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 12, 13 తేదీల్లో కొల్లిపరలోని ఔతు రామిరెడ్డి జూనియర్ కళాశాలలో పురుషులకు వాలీబాల్, మహిళలకు త్రోబాల్‌తో పాటు గ్రామీణ ఆటలు, వంటకాలకు సంబంధించి పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వాలీబాల్‌లో ప్రథమ బహుమతి రూ.9,000, త్రోబాల్‌కు రూ.5000 తోపాటు అనేక బహుమతులు అందజేస్తారన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఉత్సాహంగా పాల్గొనాలని కోరారు. అనంతరం వెంకటేశ్వరరావు, ఈశా ఔట్రీచ్ వలంటీర్లు కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎం.శివకుమార్, పీవీ రమా శంకర్ పాల్గొన్నారు.

ఆరమండలో బజరంగ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు, పరిశీలిస్తున్న బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ

చేబ్రోలు: పొన్నూరు మండలం ఆరమండలో ఆదివారం బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'మీ గుండె పదిలం' పేరిట ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ చేపట్టిన జగన్నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా ఈ శిబిరాన్ని నిర్వహించారు. విజయవాడ మెడ్ స్టార్ వైద్యశాల సహకారంతో నిపుణులైన వైద్యులు పరీక్షలు చేశారు. ఇటీవల మామిళ్లపల్లిలో గుండె వైద్య పరీక్షలు నిర్వహించి పలువురికి వైద్య సహాయాన్ని అందించారు. సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆరమండ నిర్వహించిన శిబిరంలో గుండె జబ్బు అనుమానితులుగా భావించిన 73 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఇందులో 20మందికి యాంజియోగ్రామ్ అవసరమని వైద్యులు గుర్తించారు. సకాలంలో గుండె సమస్యల్ని గుర్తించని కారణంగా పొంచి ఉన్న ప్రాణాపాయ ముప్పు నుంచి ప్రజల్ని రక్షించేందుకు ఈ కార్యక్రమానికి రూపకల్పన చేసినట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకం పేదల పాలిట వరంగా మారిందని పేర్కొన్నారు. పేదలకు ఉచితంగా వైద్యసేవల్ని అందిస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని ఆయన తెలిపారు.

అలరించిన శ్రీ శుభాంజలి ఆణిముత్యాలు

పాత గుంటూరు: మధుర గాయకుడు రామకృష్ణ ఆణిముత్యాలు పేరుతో నిర్వహించిన సంగీత విభావరి ప్రేక్షకులను విశేషంగా అలరించింది. అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజ ఆడిటోరియంలో శ్రీ శుభాంజలి కళావేదిక అధ్యక్షుడు మేకల పురుషోత్తమ ప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం సంగీత విభావరి నిర్వహించారు. తొలుత సంస్థ మహిళా కార్యదర్శి ధనలక్ష్మీ కుమారి జ్యోతి ప్రజ్వలనం చేశారు. గాయకులు ప్రసాద్, చీకటి రవికాంత్, మిరియాల ప్రసాదరావు, డాక్టర్ సి.వి.ఎస్.రామకృష్ణ, దొప్పలపూడి శ్రీనివాసరావు, అత్తోట సౌజన్య పలు పాటలను మధురంగా ఆలపించారు. కార్యక్రమంలో విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ రాసంశెట్టి నరసింహారావు, అఖిల భారత పంచాయతీ కార్యదర్శి డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, జిల్లా కాపునాడు అధ్యక్షుడు మిరియాల గోపి కుమార్ పర్యవేక్షించారు.

కార్పొరేట్ వైద్యసేవలు అందించడమే లక్ష్యం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైద్యులు, రోగులు

గుంటూరు మెడికల్: యువనారీస్ హెల్త్ కేర్ ఆర్గనైజేషన్, హోప్‌విన్ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అరుంధతి నగర్‌లో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. హోప్‌విన్ హాస్పిటల్స్ అధినేత, సీనియర్ ల్యాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ నజిరుద్దీన్ మాట్లాడుతూ కార్పొరేట్ వైద్యసేవలను సామాన్యులకు చేరువ చేయాలనే మంచి ఆశయంతో కేవలం పది రూపాయలకే ఆస్పత్రిలో ఓపీ వైద్యసేవలను అందిస్తున్నామని చెప్పారు. పరీక్షల్లో 50శాతం రాయితీ ఇస్తున్నామని పేర్కొన్నారు. సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ షమసుల్తానా మాట్లాడుతూ తమ హాస్పిటల్‌లో అన్ని రకాల స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలతో పాటుగా ఎమర్జెన్సీ మెడిసిన్, క్రిటికల్ కేర్ ఐసీయూ వైద్యసేవలునామమాత్రపు ఫీజులతో అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్ డాక్టర్ బషిరుద్దీన్, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ రాహుల్ రెడ్డి, ఆస్పత్రి మేనేజర్ పి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

10న బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా

గుంటూరు మెడికల్: సర్పంచులకు మద్దతుగా ఈనెల 10న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాటిబండ్ల రామకృష్ణ తెలిపారు. స్థానిక మంగళగిరి రోడ్డులో గుంటూరు తూర్పు నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ ఆధ్వర్యంలో సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశంలో పార్టీ నేతలు వనమా నరేంద్ర, చరకా కుమార్‌గౌడ్, వెంకటేష్, ఈదర శ్రీనివాసరెడ్డి, పాలపాటి రవికుమార్, సరోజిని, తిరుపతి రావు పాల్గొన్నారు.

చోరీకి యత్నించిన వ్యక్తిని పట్టుకున్న సెక్యూరిటీ సిబ్బంది

గుంటూరు ఈస్ట్: జీజీహెచ్‌లో బైక్ చోరీకి యత్నించిన వ్యక్తిని ఇద్దరు మహిళా సెక్యూరిటీ సిబ్బంది పట్టుకుని పోలీసులకు అప్పగించారు. వివరాలు.. ఎంఆర్‌డీ సెక్షన్ వద్ద ఇద్దరు వ్యక్తులు వైద్య సిబ్బందికి చెందిన ఓ ద్విచక్ర వాహనాన్ని నెట్టుకుంటు వెళ్తున్నారు. నాట్కో క్యాన్ విభాగం వెలుపల విధులు నిర్వహిస్తున్న మహిళ సెక్యూరిటీ బండ్లమూడి సంధ్యారాణి, సోనాబాయిలకు అనుమానం వచ్చింది. ద్విచక్ర వాహనం తోసుకెళ్తున్న ఇద్దరిని నిలువరించారు. వాహనం ఎవరిదని ప్రశ్నించగా నిందితులు పొంతనలేని సమాధానం చెప్పారు. సెక్యూరిటీ సిబ్బంది తమ సెక్యూరిటీ సూపర్‌వైజర్‌కు ఫోన్ చేశారు. ఇది గమనించి ఇద్దరు నిందితులు పారిపోయేందుకు ప్రయత్నించగా సెక్యూరిటీ సిబ్బంది వారిలో ఒకరిని గట్టిగా పట్టుకున్నారు. మరొకరు పరారయ్యారు. పట్టుకున్న నిందితుడిని సెక్యూరిటీ సిబ్బంది పోలీసులకు అప్పగించారు. సెక్యూరిటీ సిబ్బందిని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ ఫోన్‌లో అభినందించారు.

ఆకట్టుకుంటున్న వస్త్ర ప్రదర్శన



ఆభరణాలు తిలకిస్తున్న మహిళలు

పాత గుంటూరు: రింగు రోడ్ రాజేంద్రనగర్‌లోని శుభం గార్డెన్స్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన వసుధ ఫ్యాషన్, లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శన, విక్రయాలు మహిళలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. నిర్వాహకులు ప్రవీణకుమార్, సీతాకాంత్ మాట్లాడుతూ గృహిణులు, మహిళలు, విద్యార్థినులకు ఉపయోగపడేలా దేశ నలుమూలల నుంచి ప్రఖ్యాతిగాంచిన సుమారు 50కి పైగా డిజైనర్లు రూపొందించిన వస్త్రాలను ప్రదర్శనలో ఉంచామని పేర్కొన్నారు. ఈ నెల 8వ తేదీ వరకు ప్రదర్శన ఉంటుందని చెప్పారు.